# చిరు మబ్బు

పైడిపాటి సుబ్బరామశాస్త్రి



కళ చక్కని చుక్క. అయినా, కట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటామని ఎవరూ ముందుకు రాలేదు. కళ అక్క సురభి. తండ్రి జీవించి ఉండగానే పెద్దకూతురు పెళ్ళి చేశాడు వాళు ఉద్యోగరీత్యా ఢిల్లీలో ఉంటున్నారు. ఆ పెళ్ళికూడా కట్నం పోస్తే అయినదే కాని ఊరికే అయినది కాదు. ఇంట్లో భారతమ్మకు వైధవ్యం రావడంవల్ల, కళ పెళ్ళి సంగతే పట్టించుకున్నవాళ్ళు లేరు. కళతర్వాత పుట్టిన మగ పిల్లలు అంత ఊహ తెలిసిన వారుకాదు. అందుచేత ఎంత దుఃఖంలో ఉన్నా భారతమ్మే పెళ్ళి విషయం పట్టించు కోవలసి వచ్చింది.

లక్ష్మీపురం పల్లెటూరు.. ఎవరి సమస్యలు వారివి. భోజనాలకు పిలిస్తే వచ్చేవాళ్లూ, పెళ్ళిలో రెక్కసహాయం చేయమంటే చేసే వారేకాని, సంబంధాలు వెతుక్కు వచ్చేఅంత శ్రద్ధ ఊళ్ళో వాళ్ళకు లేదు. భారతమ్మది మగదక్షత లేని సంసారమయి పోయి నా కొద్దిపాటి ఆస్తి లేకపోలేదు. ఆడది. అందులో నూతన వైధవ్యం వచ్చిన ఆడది. పెళ్ళి కొడుకులను వెదకటానికి బయలుదేరలేదు కదా! అందుచేత ఇరుగుపొరుగు వారిని, ఎక్కడయినా సంబంధాలు చెప్పమన్నా, వారు చెప్పినా వాళ్ళను ఆహ్వానించి పిల్లను చూపించడం అంటే అది బ్రహ్మ ప్రళయంగా ఉండేది. ఎవళ్ళయినా ఒకరిద్దరు ఆ ఉపకారం చేసినా, అవచ్చిన వాళ్ళకు పిల్ల నచ్చకపోవడమనేది లేదు. కళ అందమైనదనీ, సంగీత జ్ఞానం కలదనీ, వాళ్ళ సంప్రదాయం మంచిదనీ, పెళ్ళిచూపులకువచ్చిన వాళ్ళు ఒప్పుకున్నా, వారు కోరే గొంతెమ్మ కోరికలు భారతమ్మకు అందుబాటులో ఉండేవి కావు. ఎదిగిన పిల్లను ఇంటిలో అట్టే పెట్టుకోవడం ఇష్టంలేక, తన భార్యను తాను పోషించుకోగల శక్తి కలవాడు దొరికితే; వారు కోరిన కట్నం విధిలేక ఇవ్వడానికి భారతమ్మ చివరకు నిశ్చయించుకుంది. ఆ నిర్ణయాన్నిమధ్యవరులతో చెబితే, వాళ్ళు తెలివితక్కువగా పెళ్ళికొడుకు వారి దగ్గర అంటే, వాళ్ళుముంచేస్తారనే భయంతో చెప్పేదికాదు.

ఒక పొరుగాయన విజయవాడ నుండివచ్చి ఒక వరుడున్నాడనీ. వాళ్ళది కోనసీమలో ఏదో ఊరనీ; వాళ్ళఅన్న విజయవాడలో ఉండడం చేత చూడడానికి ఫలానారోజు వస్తాడనీ, అప్పుడు కావలిస్తే మీ అమ్మాయిని ఎవరి యింటి దగ్గరయినా ఏర్పాటు చేసి చూపించవచ్చుననీ భారతమ్మ చెవిని వేశాడు. ఆస్తి విషయంలో మాత్రంతానాట్టే చెప్ప లేననీ, లేదనే అనుకోవచ్చుననీ, ఒకయిల్లు ఉండవచ్చుననీ, అందకుండా పొందకుండా చెప్పి ఊరుకున్నాడు. ఆ సంబంధానికే భారతమ్మ ఆశపడి, ఆయననే బ్రతిమాలుకుని తానా రోజున ఫలానా చుట్టాల యింటికి పిల్లతో వస్తాననీ, ఆ పిల్లవాడు పిలను చూసేఏర్పాటు చేయించవలసినదనీ ఆ పొరుగాయనను బ్రతిమాలుకుంది. ఆయన అంగీకరించాడు. భారతమ్మ ఇతరత్రా విచారిస్తే ఆ పిల్లవాడు ఇంజనీరు పరీక్ష ప్యాసయినట్లు తేలింది.

పిల్లవాడిని కావాలంటే చూడవచ్చునని భారతమ్మతో చెప్పినా, ఆమె పొరుగాయనతో మధ్యవర్తివిగా నీవు చూస్తేచాలుననీ, తాను నూతనంగా వైధవ్యం సంభవించిన కారణం చేత వచ్చి చూడడం బాగుండదనీ చెప్పింది. అయినా, పిల్లను చూడడానికి పిల్లవాడు వచ్చినప్పుడు ఏ తలుపుచాటునుండో చూస్తానని కూడా చెప్పింది. మధ్యవర్తి వాళ్ళయింటికి వెళ్ళేటప్పటికి అతనిఅన్న కుర్చీలో కూర్చొని ఉన్న పెళ్ళి కొడుకును చూపించాడు. మధ్యవర్తి తృప్తి పడ్డాడు. పిల్లవాడిని పిల్లను చూసుకోవడానికి రమ్మని భారతమ్మ తరఫున ఆహ్వానించాడు. "మా అన్నగారు చూస్తేచాలులెండి. ఆయన చూస్తే నేను చూసినట్లే" అని వరుడు అన్నాడు. పెళ్ళి కూతురునుచూడడానికి పెండ్లికొడుకు అన్న బయలుదేరి వచ్చాడు. పిల్లనచ్చిందనీ మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చుననీ అప్పుడే చెప్పేశాడు. యననే అభిప్రాయం వెల్లడించమని అంటే అల్లడించారు.

పెళ్ళికూతురిని చూడడానికే పెళ్ళికొడుకు రాకుండా పెద్దవాళ్ళను పంపే సంప్రదాయం పాటిస్తున్నప్పుడు, పెళ్ళి కూతురు పెళ్ళి కొడుకును చూడాలని అనడం సమంజసంగా ఉండదని, భారతమ్మ ఆ ప్రయత్నం విరమించుకుంది. మధ్యవర్తి చూశాడు కనుక; ఆయన పొరుగింటివాడే కనుక ఆయన

మనకు ద్రోహం చేయదని అనుకుంది. పెళ్ళి కొడుకు తరఫువారు చెప్పిన కట్నానికి; మూడు పూటల పెళ్ళికీ అంగీకరించింది. "మేము దూరపు వాళ్ళం. వాళ్ళమంచి చెడ్డలు మాకు అంతగా తెలియవు. ఉత్తరోత్తరా పేచీలు రాకుండా ఉండాలంటే ముందే కట్నం సొమ్ము ఇవ్వడం శ్రేయస్కరం పైగా ఇదిఆడవాళ్ళతో కూడిన వ్యవహారం" అని పెండ్లికొడుకు అన్నఅంటే; ఆ ప్రకారం సొమ్మంతా ఆడ పెళ్ళివారు; విజయవాడలో ఇంకొక ఇద్దరు మధ్యవర్తులను పెట్టుకుని ఇచ్చివేశారు. లగ్నాలు దగ్గరలోనే పెట్టుకున్నారు.

పెళ్ళివారు పెళ్ళికి లక్ష్మీపురం తరలి వచ్చారు. పెళ్ళి కుదిర్చిన మధ్యవర్తి మాత్రం అర్జంటు పని ఉన్నకారణం చేత దూరపు ప్రదేశం వెళ్ళి పోయాడు. లగ్నం సమయం ఇంకా గంటన్నర ఉన్నదనగా; ఆకాశంలో చిఱుమబ్బుపట్టి. కాలంకాని కాలంలో కుండపోతగా వర్షం కురిసింది. ఇల్లాంటి వర్షానికి హేతువు బహుశః పెళ్ళి కూతురుబియ్యం తిని ఉండవచ్చని పెళ్ళికొడుకు తరఫు వారూ పెండ్లి కొడుకే తిని ఉండవచ్చునని పెళ్లి కూతురు తరఫు వారూ హాస్యానికి అనుకున్నారు. లగ్నం సమయం అరగంట ఉన్నదనగా వాన వెలిసింది. పురోహితుడు గబగబా మంత్రాలు పఠించి ఎల్లాగయితేనేం సరిగా లగ్నం సమయానికి వధూవరుల శిరస్సుమీద జీలకర్రా బెల్లం, పెట్టించి వేశాడు. తరువాత కార్యం క్రమం కూడా జరిగిపోతోంది.

భారతమ్మ అప్పగారు బందరునుండి పెళ్లికి వచ్చింది. తలంబ్రాలు పోసుకున్న తర్వాత, చదివింపులు ఆయిపోయిన తర్వాత పెళ్లి కొడుకు నడకను జాగ్రత్తగా చూసింది. భారతమ్మను గిల్లి "ఆ నడకవంక చూడవే" అన్నది. వ్యత్యాసంగా కన్పించింది. ఇద్దరూ కలిసి ఆ నడక కుంటి నడక అని తేల్చుకున్నారు. భారతమ్మకు దుఃఖం ఆగకపోయినా నిబ్బరం తెచ్చుకుంది. కార్యం అభాసు అయిపోతుందని. "భారతీ! పెళ్లి అంటే నూరేళ్ళ పంటా, వేయేళ్ల సగ్రహంకదా! పెళ్లి కొడుకును స్వయంగా చూసుకోవద్దుటే? కోరినంత కట్నమూ పోసి, కుంటివాణ్ణికొనుక్కున్నావేమిటే! నీ కళ్ళు ఎంత మూసుకుపోయాయే!" అని జమిరింది. భారతమ్మకు కోత పెట్టినట్లయింది. వంటబ్రాహ్మణులు "ఆ వస్తువులు కావాలి- ఈ వస్తువులు కావాలని" ఒక ప్రక్క వేధిస్తున్నారు. ఒక ప్రక్క పెళ్లివారికి భోజనాల ఏర్పాటుచేయవలసి ఉంది- ఈ తరుణంలో అప్పగారు గుండెలో బండరాయి పడేసింది. సురభి పెళ్ళి వారికి కావలసిన ఏర్పాటన్నీ చూస్తోంది. పెద్దఅల్లుడు పెళ్ళికి రావడానికి వీలులేకరాలేదు- మతి ఉన్నాలేకపోయినా ఇంటి పనులన్నీ భారతమ్మ సర్దుకుంటూనే "రాత్రి లగ్నం అయిపోయింది కదా! రేపు చూద్దాములే" అని ఊరుకుంది." ఇంకాచూసేదేముంది? పెళ్లి అవనే అయిపోయింది. పిల్లగొంతుక కోయడం కూడాఅయిపోయింది" అనేసింది అప్పగారు.

తెల్లవారిన తర్వాత పెళ్లి కొడుకు నడకను పరకాయించి చూశారు. అప్పాచెల్లెలూ "వాళ్లకు రాత్రి కలిగిన అభిప్రాయం మరీ స్థిరపడింది. సురభిని పిలిచి "నీవు ఆ నడక చూసి ఎలా ఉన్నదో చెప్పవే!" కుంటిగా కన్పిస్తోందే" అన్నది. "మనముగ్గురి కళ్లూ ఒకే విధంగా


నూతనసంవత్సర శుభాకాంక్షలతో

Phones : Office : 86-464
Resi : 76840

శ్రీ దుర్గా మల్లేశ్వరీ డీసెల్ వర్క్సు

సేల్సు అండ్ సర్వీసు


జవహర్ ఆటోనగర్ :: విజయవాడ-7

మా వర్కుషాపునందు, డీసెల్ యింజన్ల పంపులు, పవరు కేలిబ్రేషన్, అరుగుదల తక్కువగానున్న పాత నాజిల్సు రీకండిషన్, ఆధునిక యంత్రములపై అనుభవముగల పనివారలచే సకాలములో చేసి యివ్వగలవారమని తెలియచేయుటకు సంతోషించుచున్నాము మైకో, యెలిమెంట్సు. డెలివరివాల్సు, నాజిల్సు న్యాయమైన సరసమైన రేట్లకులభించును.

దుర్గామల్లేశ్వరీ డీసెల్ వర్క్సు

ప్రొ॥ డి. సుందరరావు

చెబుతున్నై. కాబట్టి ఇందులో తేడాలేదు. పిల్లవాడు కుంటివాడే" అని తీర్మానించుకున్నది భారతమ్మ. ఒక గదిలో ముగ్గురూ చేరి మథన పడడం ప్రారంభించారు. ఈ సంగతి మగ పెళ్లి వారిలో ఎవరికీ తెలియనీయకుండా జాగ్రత్త పడ్డారు. ఊళ్ళో ఒకరిద్దరు శ్రేయస్సుకోరే వాళ్ళను పిలచి వాళ్ళకు చెప్పారు. అందులో ఒకడు "ఏం తెలివమ్మా నీది! మొత్తం మీద ఆడపెత్తనం చేశావు! కట్నం సొమ్ము ఎక్కడయినా పుందిచ్చుకుంటారా? అల్లా ఇవ్వకుండా ఉంటేనా-వచ్చిన వాళ్ళనుపొండిఅంటే మెదలకుండా లేచిపోయేవారు. ఇప్పుడో చిక్కిన తగువా? చిక్కని తగువా? అని చూసుకో! మనమే వాళ్ళచేతులో చిక్కాం. తగాదావల్ల ప్రయోజనం ఏమిలేదు" అన్నాడు. "ఇప్పుడయినా మించి పోయిందేమిలేదు. నేనయితే కట్నం సొమ్ము పోయినా సరే ముందు వాళ్ళని ఇక్కడనుండి లేచిపొమ్మనేవాణ్ణి" అన్నాడు ఇంకొకడు. "ఏదో ఒకటి చెయ్యాలికాని, చూస్తూ చూస్తూ, పిల్లదాని గొంతుకకోయలేము భగవంతుడో!" అన్నది భారతమ్మ అప్పగారు. ఆమె భర్తపోయి చాలా కాలం అయింది. అయినా భర్త అప్పుడేపోయినంత దుఃఖం వచ్చింది ఆమెకు. దానితో భారతమ్మ బేజారైపోయి పురోహితుణ్ణి ఒకసారి లోపలకురమ్మనికబురు పెట్టింది వచ్చాడు. విన్నాడు. 'నాకీ అనుమానం రాత్రే తగిలిందమ్మా! మీరిష్టపడి కుదుర్చున్న సంబంధం కదా— ఈ పాపం నాకెందుకనిఊరుకున్నాను" అన్నాడు. "అయితే" అని రెండువేళ్లు ముందుకు చాపాడు "ఇప్పుడొక విషయముంది. 'సప్తపది" పూర్తి అయితే కాని వివాహం పూర్తి అయినట్లుకాదు. అప్పుడు కాని వధువు గోత్రం, వరుడిగోత్రంతో కలిసిపోదు. అంతవరకూ మనకు అవకాశం ఉంది- అయినాఇది మీరు ఆలోచించుకోవలసిన విషయం కాని: నేను చెప్పేది కాదు. వశిష్టుడు కనుక వైదిక రహస్యాన్ని దాచకుండా చెప్పాను" అన్నాడు. భారతమ్మకు కాళ్ళాడలేదు. తాను పాతాళలోకానికి దిగిపోతున్నానా అనిపించింది. "ఏమయినా ఇహ వచ్చిన పిల్ల అభిప్రాయం ఇప్పుడయినా తెలుసుకోకుండా మనం ఏమి పనీచేయరాదు" అనేసింది. సురభి కళను పిలుచుకు వచ్చింది. వీళ్ళు గుచ్చిసలాడడం గమనిస్తూనే ఉన్నది కాని ఇదమిత్థమని తెలియదు. విన్నవెంటనే కళ ముఖం కళావిహీనమయిపోయింది. కళ సిగ్గు పడుతూ: పురోహితుడేపని చేయమంటే ఆ పనిని పెళ్లిపీటల మీద కూర్చుని చేస్తోందేకాని: వీళ్లు పరిశీలించినంతగా పెళ్లికొడుకు నడకను పరిశీలించనే




లేదు. మళ్ళీ వెళ్లి తలుపుచాటుగా నిలబడి పరిశీలించింది. "నాకూ అలాగే అనిపిస్తోంది" అన్నది కన్నీళ్ళతో గదిలోకి వచ్చి: ఊళ్లో వాళ్లు ఆడుకుని పెళ్లివారికి కావలసిన సౌకర్యాలన్నీ చూస్తూనే ఉన్నారు. ఇక్కడ హాలహాలం పుట్టినట్లు ఎవ్వరికీ తెలియదు. "ఏదో ఆలోచించుకు చెప్పండి త్వరగా" అన్నాడు పురోహితుడు.

"ఇందులో ఎవ్వరూ ఆలోచించుకుచెప్పేది ఏమీ లేదు. రేపు అతనితో కాపురం చేయవలసినది ఆ పిల్ల. అది ఎల్లా చేయమంటే అల్లా చేస్తాను" అన్నది భారతమ్మ. "ఇప్పుడు 'బరువు-బారం' అంతా నీ మీదే ఉన్నది. నీవు ప్రాజ్ఞురాలవు కళా! చిన్నపిల్లవు కావు. ఇది సిగ్గు పడవలసిన సమయమూ కాదు. కనుక ఖండితంగా చెప్పివేయి" అన్నాడు పురోహితుడు. కళ తడుముకోలేదు. ఆలోచించలేదు. వెంటనే "ఎవరి గీతలో ఎల్లా ఉంటే అల్లా జరుగుతుంది కార్యక్రమం ఆపవద్దు" అనేసి వెళ్లిపోయింది. "పెళ్ళి కూతురే ఒప్పుకుంది. ఇకనీవు మాట్లాడకూడదు: భారతమ్మా" అన్నాడు అక్కడి పెద్దమనిషి ఒకడు- లేని వికాసం తెచ్చుకుని అందరూ పని చేశారు.

ఆ రాత్రి భోజనానికి: పెళ్ళి కుదిర్చిన పెద్దమనిషి ఊరినుంచి వచ్చిన వెంటనే వచ్చాడు. భారతమ్మ విడిగా పిలిచి "ఏమండీ! పెళ్ళికొడుకును చూసినప్పుడు: అతని నడకనుమీరు చూశారా?" అని అడింగింది. "ఆడపిల్లల నడక చూస్తాము కాని. మగపిల్లలను నడిపించి చూడడం అలవాటులేదే - అయినా నేను వెళ్ళినప్పుడు కుర్చీలో కూర్చొని ఉన్నాడు" అన్నాడు. "పెళ్ళికొడుకు కుంటివాడంటే!" "ఛా ఛా! ఎవడుచెప్పాడునీకు. నిక్షేపంగా కాళ్ళుంటేను" "కాళ్ళున్నయ్యండీ! కాని నడక కుంటి-అడ్డదిడ్డంగా పడతై. సవ్యంగా అందరూ నడచినట్లుగా నడవలేడు. మా ప్రారబ్ధం కొద్దీ మీ కళ్ళు మూసుకు పోయినై. అయినా ఇప్పుడే మీరు మాట్లాడకండి. పెళ్ళివారితో పేచీ వస్తుంది" అన్నది. ఇంతమంది ఏకగ్రీవంగా అనుకున్న తర్వాత అతని నడక కుంటినడకే అయిఉంటుందేమోనని అనుకున్నాడాయన.

పెళ్ళి అప్పగింతలయి పోయిన తర్వాత కళను గృహ ప్రవేశానికి పెళ్ళివారు తీసుకు వెళ్ళారు. కూడా సురభికూడా వెళ్ళింది. గృహప్రవేశ సమయంలో కూడా నడక అదే విధంగా ఇద్దరికీ కన్పించినది. మరురోజు పెళ్ళికొడుకు సూటు బూటూ వేసుకుని చకచకా నడవటం ప్రారంభించాడు. సురభి" మఱదిగారు మా ఊళ్ళో మందంగా నడిచేవారు, ఇక్కడ టకటకా నడుస్తున్నారే!" అన్నది. "వదినెగారూ! నాకు పంచ కట్టుకోవడం అలవాటు లేదు. కట్టుకోక తప్పదాయె. అది కాళ్ళ కడ్డం బడుతూఉంటే దాని మీదనే శ్రద్ధ చూపడంతో నా నడక మందగించింది. కొంత వికారంగా నాకే అన్పించింది." అన్నాడు.

సురభి పక్కున నవ్వింది. కళకూడా నవ్వింది. వెంటనే సురభి లక్ష్మీపురం ఉత్తరం వ్రాసింది. పెళ్ళికొడుకు కుంటివాడుకాడనీ. పంచె కట్టుకోవడంచేత కాని వాడు మామూలే ననీ. భారతమ్మ హృదయం తేలికపడి, లోని చిఱుమబ్బు కాస్తా తొలగిపోయింది. కళ ముఖం కళ కళలాడింది.